ధవళగిరిపై ఆధ్యాత్మిక శోభ


ధవళేశ్వరంలో కొలువైన శ్రీలక్ష్మీజనార్దనస్వామి

- నేడు రథోత్సవం, జనార్దనస్వామి కల్యాణం
- విస్తృత ఏర్పాట్లు

ధవళేశ్వరం: గ్రామంలోని ధవళగిరిపై కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీజనార్దనస్వామి కల్యాణం మంగళవారం రాత్రి 9 గంటలకు అంగరంగ వైభవంగా జరగనుంది. అంతకుముందు తెల్లవారుజామున 3 గంటలకు విశేష అర్చనలు నిర్వహిస్తారు. ఉదయం 11 గంటలకు రథ సంప్రోక్షణ చేసి, మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామివారి రథోత్సవాన్ని ప్రారంభించనున్నారు. రథం వీధి నుంచి ప్రారంభమయ్యే రథోత్సవం స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్ వరకూ సాగనుంది. ఈనెల 25వ తేదీ వరకూ స్వామివారి కల్యాణోత్సవాలు జరగనున్నాయి. రథోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి వేలమంది హాజరుకానున్నారు. సాయంత్రం 6 గంటలకు ధ్వజారోహణ, అంకురార్పణ, వాస్తుపూజ నిర్వహిస్తారు. స్వామివారి కొండ దిగువ నుంచి ప్రారంభమయ్యే రథోత్సవం స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్ వరకూ జరుగుతుంది. స్వామివారి కల్యాణోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.సురేష్ తెలిపారు.

ధవళగిరి ముస్తాబు

జనార్దనస్వామి కల్యాణానికి ధవళగిరి ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. స్థానిక రామపాదాల క్షేత్రంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శి డి.సూరిబాబు పర్యవేక్షిస్తున్నారు. మామిడి తోరణాలు, అరటి చెట్లతో ఆలయ ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు.

1890లో పాల్గొన్న టంగుటూరి

1890లో జరిగిన రథోత్సవంలో విద్యార్థిగా ఉన్న ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పాల్గొన్నారు. ఈ సంఘటనలను మహాకవి చిలకమర్తి లక్ష్మీనరసింహపంతులు పద్య రూపంలో వర్ణించారు. దీనిని వివరిస్తూ ఆలయం దిగువన శిలాఫలకాన్ని సైతం ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు

స్వామివారి కల్యాణోత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మఫ్టీలో పోలీసులు ఉంటారని సీఐ వినయ్ మోహన్ తెలిపారు. ఆకతాయిలను ఉపేక్షించేది లేదన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాతీయ రహదారి మీదుగా వాహనాలను మళ్లిస్తామన్నారు.

క్లుప్తంగా

వైభవంగా శిఖర కలశ ప్రతిష్ఠాపన


కలశ ప్రతిష్ఠాపన చేస్తున్న అర్చకులు

ధవళేశ్వరం: గ్రామంలోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం వద్ద రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. బలుసు రామ సూర్యనారాయణమూర్తి, నౌడు వేణుమాధవరావు, ఉంగరాల శ్రీనివాస్, గంధం కోదండ రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 10.38 గంటలకు రాజగోపుర ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. మంగళంపల్లి చంద్రశేఖరశాస్త్రి (సభాపతి) ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

శ్రీరాముని మొక్కల కూర్పునకు అవార్డు


పురస్కారాలతో నర్సరీ అధినేత పుల్లా చంటియ్య

కడియం: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని కడియపులంకలోని శ్రీ సత్యదేవ నర్సరీ యాజమాన్యం ఏర్పాటు చేసిన మొక్కల కూర్పు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు, మిరాకిల్ వరల్డ్ రికార్డ్స్‌లో నమోదైంది. ఈ మేరకు నర్సరీ అధినేత పుల్లా సత్యనారాయణ (చంటియ్య)కు ఆయా సంస్థలు ధ్రువీకరణ పత్రాలను అందజేశాయి. ఆ వివరాలను నర్సరీ రైతు పుల్లా పెద సత్యనారాయణ సోమవారం స్థానిక విలేకరులకు తెలిపారు. లక్షకు పైగా మొక్కలతో ఏర్పాటు చేసిన శ్రీరాముడు చిత్రపటానికి ఈ గుర్తింపు దక్కిందన్నారు. హిందువులకు ఆరాధ్యుడైన శ్రీరాముని ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని తమ వంతు సేవగా మొక్కలతో ఈ కూర్పు ఏర్పాటు చేశామన్నారు. దీనికి పురస్కారం దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు.

నృసింహస్వామి నిజరూప దర్శనం


స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సీటీఆర్ఐ: స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచల నగర్ శ్రీ వరహాలక్ష్మి నృసింహస్వామి క్షేత్రంలో శ్రీమదుభయ వేదాన్తాచార్య పీఠం ట్రస్టు, శ్రీరంగం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న 22వ వార్షిక చందన యాత్ర మహోత్సవాలలో భాగంగా సోమవారం స్వామి నిజరూప దర్శనమిచ్చారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకూ నిజరూప దర్శన సేవకు భక్తులు పోటెత్తారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, కాలెపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు అవసరాల శ్రీకిరణ్ స్వామి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాతం, ఆరాధన, చందనోత్తరణ, సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. మంగళవారం ఉదయం 11 గంటలకు శ్రీవారి చక్రస్నానం నిర్వహించనున్నారు.

పూర్తిస్థాయిలో పార్కు అభివృద్ధి


పార్కును ప్రారంభిస్తున్న మంత్రి వేణు, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరనగర్ పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. వెంకటేశ్వర నగర్‌లో రుడా నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన పార్కును, వాకింగ్ ట్రాక్‌ను సోమవారం ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. మంత్రి వేణు మాట్లాడుతూ వెంకటేశ్వర నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ పెద్దల సూచనలు మేరకు పార్కును ఆహ్లాదకరంగా అభివృద్ధి చేస్తామన్నారు. నగరపాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదసాలి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ముదునూరి రూప్‌చంద్, హుకుంపేట సొసైటీ చైర్మన్ బొప్పన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కడియం: కడియపుసావరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కొప్పిశెట్టి శ్రీనివాసరావును ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, ఎస్సై బీఎస్ దుర్గాప్రసాద్ సోమవారం అరెస్టు చేశారు. అతడి నుంచి 180 ఎంఎల్ ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- ఘనంగా మాదిగల బంధువందనం


మంత్రి వేణుగోపాలకృష్ణను సత్కరిస్తున్న సంఘీయులు

రాజమహేంద్రవరం రూరల్: సామాజిక న్యాయం అందించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక మోరంపూడి గోల్డెన్ సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాల్లో సోమవారం రాజమండ్రి రూరల్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మాదిగ కులాల ఆత్మీయ కలయిక 'బంధువందనం' నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి వేణు, రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డప్పు కొట్టి సభికుల్లో మంత్రి వేణు ఉత్సాహాన్ని నింపారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ భారత రాజ్యాంగాన్ని రచించారని, ఆయన ఆశయాల సాధనకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఆయా వర్గాల ఉన్నతికి కృషి చేస్తూ ఆదర్శవంతమైన పాలన చేస్తున్నారన్నారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ మాదిగల అభ్యున్నతికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాదిగ సంఘాల ప్రతినిధులు ఎంపీపీ సుధాకర్, విజయ్, మహేష్, మోర్తా వీర్రాజు, చింతపర్తి చిట్టిబాబు, రాంబాబు, పసలపూడి శ్రీనివాస్, చిర్రా గణేష్, చినబాబు, ఏసురత్నం, సునీల్, రత్నరాజు, మేకల సూర్యారావు, ముసలయ్య, ఆనందరావు, పైడిమళ్ల సురేష్ పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం


శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్


శివాజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న బీజేపీ నాయకులు

- ఎంపీ భరత్‌రామ్
- మరాఠా యోధుడి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ

రాజమహేంద్రవరం సిటీ: భారత జాతి వీరత్వానికి ప్రతీక అయిన ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నందం గనిరాజు జంక్షన్‌లో ఆయన విగ్రహ ప్రతిష్ఠకు సోమవారం ఎంపీ భూమి పూజ చేశారు. ముందుగా శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ హిందూ రాజ్యస్థాపనలో భాగంగా శివాజీ చేసిన త్యాగాలు సూర్యచంద్రులు ఉన్నంత వరకూ చిరస్థాయిగా నిలిచి ఉంటాయన్నారు. అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తానని మాట ఇచ్చానని, ఆ మాట ప్రకారం ఈ రోజు భూమిపూజ చేసినట్లు తెలిపారు. శివాజీ విగ్రహంతో పాటు ఇక్కడనే శ్రీకృష్ణుని విగ్రహం, ఆలయం కూడా ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం సుబ్రహ్మణ్యం మైదానం నుంచి స్థానిక 3వ పట్టణ పోలీసు స్టేషన్ వరకూ నిర్వహించిన భారీ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాంతారామ్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగిన శివాజీ

రాజమహేంద్రవరం రూరల్: ఛత్రపతి శివాజీ మహారాజ్ దేశం గర్వించదగిన వీరుడని, ఆనాడు ఆ మహనీయుడు చేసిన త్యాగాలు దేశంలో హిందుత్వానికి ఊపిరి పోశాయని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కురగంటి సతీష్ కొనియాడారు. హుకుంపేట రావిచెట్టుసెంటర్‌లో బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు ముద్రగడ సూర్యచంద్రమోహన్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి నిర్వహించారు. రాష్ట్ర యువమోర్చా కార్యదర్శి కందుకూరి మనోజ్ బాబు మాట్లాడుతూ శివాజీ పరాక్రమాలను కొనియాడారు. ఎస్‌వీబీఎస్ ఆచారి, తనుబుద్ధి సూర్యభాస్కరరావు, యానాపు ఏసు, సిద్ధాని వెంకట్, బోగవల్లి వెంకట రామారావు పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం


అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ సత్యవేణి


అర్జీ స్వీకరిస్తున్న కేఆర్‌సీ తహసీల్దార్ సత్యనారాయణరాజు

రాజమహేంద్రవరం సిటీ: అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నట్టు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సత్యవేణి అన్నారు. కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 28 అర్జీలను స్వీకరించామన్నారు. ఆమె మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంతో కూడిన సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ జి.పాండురంగారావు, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్పందనకు 11 అర్జీలు

సీటీఆర్ఐ: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆర్డీవో తరపున కోనేరు రంగారావు కమిటీ (కేఆర్‌సీ) డివిజన్ తహసీల్దార్ సత్యనారాయణ రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై 11 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జీఎల్ఎస్ దేవి పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగాలి

- సినీ నటుడు ఆలీ, ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా ఆర్పీఎల్ టోర్నమెంట్ ప్రారంభం


బ్యాటింగ్ చేస్తున్న సినీనటుడు ఆలీ, చిత్రంలో ఎంపీ భరత్‌రామ్

ప్రకాశం నగర్: అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుడు, సినీ నటుడు ఆలీ, ఎంపీ మార్గాని భరత్ రామ్‌లు ఆకాంక్షించారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన రాజమండ్రి ప్రీమియర్ లీగ్ (ఆర్పీఎల్)ను సోమవారం వారు ప్రారంభించారు. ముందుగా ఆలీకి ఎంపీ భరత్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ పార్లమెంటు కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఆరేళ్లుగా అజ్జరపు వాసు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆర్పీఎల్ నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులు సాధన చేసేందుకు అనువైన క్రీడా ప్రాంగణాలను తీసుకురాబోతున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఖేలో ఇండియా నిధులు రూ.20 కోట్లతో ఇండోర్ స్టేడియం వచ్చిందన్నారు. నగరంలో కూడా అంతర్జాతీయ ప్రమాణాలతో ఒక ఇండోర్ స్టేడియం, ఒక క్రికెట్ స్టేడియం తీసుకురానున్నట్టు తెలిపారు. ఆర్పీఎల్ సీజన్ 6లో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 18 టీమ్‌లు తలపడనున్నాయని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం, పోలీసు గ్రౌండ్, ఓఎన్జీసీ గ్రౌండ్స్‌లో ఈ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు తెలిపారు. అంతకు ముందు ఆలీ టాస్ వేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కొద్దిసేపు ఎంపీ భరత్, ఆలీ బ్యాటింగ్ చేసి సందడి చేశారు. కార్యక్రమంలో ఆర్పీఎల్ నిర్వాహకులు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, నక్కా శ్రీనగేష్, మజ్జి అప్పారావు పాల్గొన్నారు.

జనసేన నేతలతో పవన్ భేటీ

సాక్షి, రాజమహేంద్రవరం: జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం తూర్పు గోదావరి జిల్లా పర్యటనకు వచ్చారు. విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరిన ఆయన రాత్రి 7.40 గంటల సమయంలో మధురపూడిలోని రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నగరానికి చేరుకుని ఓ హోటల్‌లో బస చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలతో వివిధ అంశాలపై చర్చించినట్లు సమాచారం.

మంగళవారం ఉదయం ఏవీ అప్పారావు రోడ్డులోని జనసేన కార్యాలయంలో రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, అనపర్తి తదితర అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, పార్టీ ముఖ్య నేతలతో భేటీ కానున్నారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన పొత్తులో అనుసరించాల్సిన విషయాలపై చర్చించనున్నారని తెలిసింది. సమావేశం అనంతరం పార్టీ సమన్వయకర్తలను ప్రకటించే అవకాశం ఉందని చెబుతున్నారు. రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థుల ఖరారు విషయంలో కొన్ని నెలలుగా జనసేన నేతల్లో నెలకొన్న ఉత్కంఠకు తెర పడుతుందని ఆ పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేన అధ్యక్షుడు కందుల దుర్గేష్, రాజానగరం జనసేన నేత బత్తుల బలరామకృష్ణ తదితరులు పవన్ కల్యాణ్ వెంట ఉన్నారు.

ఘనంగా కుంతీదేవి అమ్మవారి జాతర


దుళ్లలో శేషవాహనంపై దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి


కడియపులంకలో కుంతీదేవి అమ్మవారు

కడియం: కడియపులంకలో కుంతీదేవి అమ్మవారి జాతర ఆదివారం రాత్రి ఘనంగా జరిగింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి అమ్మవారికి జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆర్కెస్ట్రా, కోలాటం, కేరళ సంప్రదాయ వాయిద్యాలు, వేషధారణలు ఆకట్టుకున్నాయి. అమ్మవారికి గ్రామంలోని మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. కాగా.. ఆలయ నిర్మాణ దాత, అన్నదానానికి సహకరిస్తున్న ప్రముఖ నర్సరీ రైతు మార్గాని సత్యనారాయణ, లక్ష్మి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

శేషవాహనంపై స్వామివారు

కడియం: దుళ్లలోని శ్రీ భూసమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాల నడుమ, గోవింద మాలదారులు, భారీ ఎత్తున భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా.. ఉదయం ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యుల పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. సాయంత్రం మేదినీపూజ, అంకురార్పణ, ధ్వజారోహణం, సహస్ర దీపాలంకరణ జరిగాయి. అనంతరం శేషవాహనంపై స్వామివారికి గ్రామోత్సవం జరిపించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, ఆలయ భక్త బృందం పాల్గొన్నారు. కాగా.. మంగళవారం రాత్రి స్వామివారు గరుడ వాహనంపై దర్శనమిస్తారు.

పిల్లల్లో క్రీడాసక్తిని ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు


వెయిట్ లిఫ్టింగ్ విజేతలను అభినందిస్తున్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్

సీటీఆర్ఐ: పిల్లల్లో క్రీడల పట్ల ఉన్న అభిరుచిని గుర్తించి, ప్రోత్సాహం అందిస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్ అన్నారు. పాట్నాలో ఈనెల 13 నుంచి 16 వరకూ జరిగిన 67వ జాతీయ స్కూల్ గేమ్స్ 2023 –24లో వెయిట్ లిఫ్టింగ్‌లో అక్కాచెల్లెళ్లు కారంగి హేమశ్రీ, కారంగి తరంగణి ప్రతిభ చూపారు. సోమవారం కలెక్టరేట్‌లో తమకు కలిసిన వారిని కలెక్టర్, ఎస్పీ అభినందించారు. హేమశ్రీ వెయిట్ లిఫ్టింగ్ 49 కేజీ కేటగిరీలో గోల్డ్ మెడల్, తరంగణి 55 కేజీల కేటగిరీలో సిల్వర్ మెడల్ సాధించారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇటీవలే ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను ఘనంగా నిర్వహించిందన్నారు. ఆ విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు సత్యనారాయణ, కృపావతి, కోచ్ భాస్కరరావును అభినందించారు.

అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి


త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకులు

కంబాలచెరువు: ఎంపీ మార్గాని భరత్‌రామ్‌పై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు డీవీడీ త్రినాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం ఎస్సైకు ఫిర్యాదు అందించారు. లీగల్ సెల్ నాయకుడు పీవీవీబీ రాజు మాట్లాడుతూ ఇటీవల తెలుగు దేశం, జనసేన పార్టీల నాయకులు కొందరు ఆగంతకులను రాజమండ్రిలోని రద్దీ ప్రాంతాల్లో ముసుగులతో బైకులపై తిప్పుతూ, ఎంపీ భరత్‌రామ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారన్నారు. ఇసుక అక్రమ రవాణా, ఈట్ స్ట్రీట్, అభివృద్ధిపై కమీషన్లు తీసుకున్నారంటూ పోస్టర్లు ముద్రించి పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ పీవీవీఎస్ రాజు, రీజనల్ కోఆర్డినేటర్ సాదిక్ హుస్సేన్, నాయకులు సుమన్ పాల్, ఎస్.ప్రవీణ్ కుమార్, వై.అశోక్ కుమార్, ఎస్.నాగేశ్వరరావు, సునీల్, నాగిని రమ్య, కరీమున్నీ పాల్గొన్నారు.

బీసీల మధ్య చిచ్చుపెడుతున్న ఆదిరెడ్డి కుటుంబం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పాలిక శ్రీను

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసు తమ రాజకీయ స్వార్థం కోసం బీసీ సామాజిక వర్గాల మధ్య కులాల చిచ్చు పెడుతున్నారని బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను తదితరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఎల్ పురంలోని ఎంపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిరెడ్డి అప్పారావు ఏ పార్టీలో ఉన్నా శెట్టిబలిజ సామాజిక వర్గానికి చేసింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. నగరంలో వెలమ సామాజిక వర్గ ఓటర్లు ఆరేడు వేల మంది ఉంటారని, అదే బీసీ సామాజిక వర్గ ఓటర్లు 38 వేల మందికి పైగా ఉన్నారన్నారు. ఆదిరెడ్డి కుటుంబ సభ్యులు మేయర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులతో రాజ్యాధికారాన్ని అనుభవిస్తున్నారంటే అది మా బీసీల చలువే అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు ఎన్నో రకాలుగా న్యాయం చేస్తోందని, దానిలో భాగంగా రాజమహేంద్రవరం పార్లమెంట్, రూరల్, సిటీ అభ్యర్థులుగా బీసీలకే ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ప్రజల్లో ఎంపీ భరత్ రామ్‌కు ఉన్న ఆదరాభిమానాలు చూసి ఓర్వలేకపోతున్నారన్నారు. సమావేశంలో బీసీ నేతలు కడలి వెంకటేశ్వరరావు, పెంకే సురేష్, పితా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మేము సైతం


నాగవాణికి ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

ధవళేశ్వరం: పర్యావరణం పరిరక్షణలో మేము సైతం అంటూ ఐటీసీ సహకారంతో ఏజీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వావ్ కార్యక్రమంలో ధవళేశ్వరం డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహించిన ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించి విద్యార్థులు సేకరించిన పాత పుస్తకాలు, పేపర్లను నిర్వాహకులకు అందజేశారు. ఏజీఎస్ రీజినల్ కోఆర్డినేటర్ రాము విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగమైన చెట్లను కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఏజీఎస్ స్కూల్ కో ఆర్డినేటర్ దుర్గబాబు మాట్లాడుతూ ఒక టన్ను పేపర్ తయారు కావాలంటే 17 చెట్లు అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ రీసైక్లింగ్‌కు సహకరిస్తే మన వంతుగా చెట్లను కాపాడుకోవచ్చని సూచించారు. అనంతరం వావ్ ప్రోగ్రాంలో స్కూల్ టాపర్‌గా నిలిచి ఇంటర్‌స్కూల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న పాత్తూరి సాహితీ నాగవాణికి ట్రోఫీని, తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఆసక్తికరంగా పాఠాలు బోధించాలి

కంబాలచెరువు: ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులు విద్యార్థులకు ఆసక్తికరంగా బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవ రావు అన్నారు. స్థానిక డీఎంహెచ్ స్కూల్లో జరుగుతున్న ప్రాథమికస్థాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని సోమవారం ఆయన సందర్శించారు. షెడ్యూల్ ప్రకారం సమావేశ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులు తాము నేర్చుకున్న అంశాలనే కాకుండా, వేరే పాఠశాలలో అనుసరిస్తున్న బోధనా పద్ధతులు, వినూత్న అంశాలు తెలుసుకునే వీలుంటుందన్నారు. పాఠశాల సమయమంతా బోధనకే కేటాయించాలన్నారు.